క్లుప్తంగా

పాఠశాలకు గేటు వితరణ



వినుకొండ: స్థానిక నరసరావుపేట రోడ్డులోని ఎన్ఎస్పీ కాలనీలో గల జడ్పీహెచ్ పాఠశాలకు ముఖద్వారం గేటును దాత ముత్తినేని యశోదరావు సహకారంతో నిర్మించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయలు సి.హెచ్. వీరప్పయ్య సోమవారం తెలిపారు. మండలంలోని నీలగంగవరం గ్రామానికి చెందిన ముత్తినేని యశోదరావు తన తల్లిదండ్రులు నాసరయ్య, వెంకటమ్మల జ్ఞాపకార్థం రూ.80 వేలతో గేటును ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ సందర్భంగా దాతకు ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల పీడీ రాధాకృష్ణమూర్తి, ప్రైమరీ పాఠశాల హెచ్ఎం ఎస్.పద్మజ, ఏలీసా, ఎలిజబెత్‌రాణి, గోవిందునాయక్, రాం బాబు, చంద్రశేఖర్, శాంతి, రామాంజనేయులు, మల్లయ్య, గాయత్రి, కోటిరత్నం, సంధ్య, వార్డెన్ రేణుకమ్మ, సీఆర్పీ విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

పర్వతారోహణ శిబిరానికి క్యాడెట్స్ ఎంపిక



లక్ష్మీనారాయణ



వెంకటసాయిరెడ్డి

నరసరావుపేట రూరల్: రాష్ట్రస్థాయి పర్వతారోహణ శిబిరానికి లింగంగుంట్ల శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్ ఎన్‌సీసీ క్యాడెట్లు ఎంపికైనట్టు పాఠశాల ఎన్‌సీసీ ఆఫీసర్ షేక్ ఫాతిమా సోమవారం తెలిపారు. పాఠశాలకు చెందిన మల్లా లక్ష్మీనారాయణ, ఎం.వెంకటసాయిరెడ్డిలు అరకు వ్యాలీలో ఈనెల 24వతేదీ నుంచి జరిగే శిబిరంలో పాల్గొంటారని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి ఎన్‌సీసీ శిబిరానికి ఎంపికైన క్యాడెట్స్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయినీ ఎం.పార్వతి, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రత్యేక ఆధార్ క్యాంపుల ఏర్పాటు

నూజెండ్ల: మండలంలోని 15 సచివాలయాల పరిధిలో ఈ నెల 23 నుంచి 24 వరకూ ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో పి.ఉమాదేవి తెలిపారు. ప్రస్తుతం దసరా సెలవులు కావటంతో విద్యార్థులకు అందుబాటులో ఉండేలా జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఈ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. పిల్లల ఆధార్ అప్‌డేట్, కొత్త ఆధార్ నమోదు ఈ క్యాంపులో చేసుకోవచ్చన్నారు. ఈ నెల 23 న లింగముక్కపల్లె, పాత కొత్త జెడ్డావారిపాలెం, తిమ్మాపురం, పుచ్చనూతల, వి.అప్పాపురం, మారెళ్ళవారిపాలెం గ్రామాల్లోనూ 24 వతేది పాత నాగిరెడ్డిపల్లె, పాత చెరుకొంపాలెం, పువ్వాడ, నూజెండ్ల, గురప్ప నాయుడుపాలెంలోనూ 25 తేది ముక్కెళ్ళపాడు, ముప్పరాజుపాలెం, ములకలూరు, ఉప్పలపాడు , తెల్లపాడు, 26 వ తేదిన ఐనవోలు, కంభంపాడు, జంగాలపల్లె, త్రిపురాపురం, పమిడిపాడు, ముతరాసుపాలెం గ్రామాల్లో క్యాంపులు నిర్వహిస్తారన్నారు. అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



నరసరావుపేట రూరల్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని జిల్లా మానవ వనరుల కమిషనర్, స్కౌట్ మాస్టర్ పమ్మి వెంకటరెడ్డి తెలిపారు. భారత్ స్కౌట్స్‌అండ్ గైడ్స్, మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్ సంయుక్త ఆధ్వర్యంలో వారం రోజుల పాటు నిర్వహించిన సముద్ర తీర పరిశుభ్రత కార్యక్రమం సోమవారం ముగిసింది. బాపట్ల సమీపంలో సూర్యలంక సముద్రతీరంలో వ్యర్థ పదార్థాలు ఏరివేత కార్యక్రమంలో 25 మంది స్కౌట్స్, గైడ్స్ పాల్గొన్నారు. సముద్ర జలాలను కలుషితం చేయొద్దని, పర్యావరణానికి హాని తలపెట్టవద్దని పర్యాటకులకు సూచించారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా ఆర్గనైజింగ్ కమిషనర్ బట్టు రవీంద్రనాద్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

వినుకొండ: పట్టణంలో ఓ యువకుడు అనుమానస్పదంగా మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని ఏటీఎం కాంపౌండ్ లో యువకుడు గాయాలతో పడి ఉన్నాడు. స్థానికులు 100కి కాల్ చేసి తెలియజేశారు. సమాచారం తెలుసుకున్న 108 సిబ్బంది బాధితుడిను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, డాక్టర్లు మెరుగైన వైద్యం కోసం నరసరావుపేట ఆసుపత్రికి రిఫర్ చేశారు. ఆసుపత్రికి తీసుకువెళుతుండగా మార్గమధ్యంలో యువకుడు మృతి చెందాడు. ముఖంపై తీవ్రగాయాలు ఉన్నాయి. మృతుడు గతంలో రౌడీషీటర్‌గా ఉన్న కుమారుడు అబ్బాస్‌గా గుర్తించారు.



నరసరావుపేటలో బాలా త్రిపురసుందరి అలంకరణలో శ్రీకన్యకాపరమేశ్వరీ మాత



నరసరావుపేటలో బ్రాహ్మీ అలంకరణలో శ్రీశారదాంబ అమ్మవారు



నాదెండ్ల కన్యకాపరమేశ్వరి ఆలయంలో బాలా త్రిపురసుందరీదేవిగా



చిలకలూరిపేట బ్రాహ్మీ అలంకారంలో శృంగేరి శారదాంబ



రేమిడిచర్లలో గంగా గౌరీ ఆలయంలో శ్రీ బాలా త్రిపుర సుందరీ దేవిగా..



శావల్యాపురంలో బాలా త్రిపురసుందరి దేవిగా...

ఆ బాల గోప విదితా

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం నుంచి ఆరంభమయ్యాయి. తొలుత ఆలయాల్లో మూలవిరాట్, ఉత్సవమూర్తులకు అలంకారం ఏర్పాటు చేసి గణపతి పూజ, అఖండ దీపారాధన, పుణ్యాహవాచనం, నవగ్రహ ఆరాధన, కలశ ప్రతిష్టాపన, సహస్రనామార్చనలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయాలకు తరలివచ్చారు.

–సాక్షి నెట్‌వర్క్

పదవులు పొందిన వారు బాధ్యతగా పనిచేయాలి

రాష్ట్ర ఎస్‌సీ సెల్ ప్రధాన కార్యదర్శి ఎజ్రాకు సూచించిన డాక్టర్ గోపిరెడ్డి



కందుల ఎజ్రాను సన్మానించిన డాక్టర్ గోపిరెడ్డి, నాయకులు

నరసరావుపేట: పదవులు పొందిన వారు బాధ్యతగా పనిచేసి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ రాష్ట్రానికి ముఖ్యమంత్రిని చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. నూతనంగా రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన పట్టణానికి చెందిన కందుల ఎజ్రా తన అనుమాయులతో సోమవారం పార్టీ కార్యాలయంలో డాక్టర్ గోపిరెడ్డిని కలిసి దుశ్శాలువతో ఘనంగా సన్మానించి తన నియామకానికి సహకరించినందుకు కృతజ్ఞతలు తెలియచేశారు. పదవి హోదాగా భావించకుండా ఒక బాధ్యతగా భావించాలని సూచించారు. పదవి పొందిన ఎజ్రాను ఘనంగా సన్మానించారు. ఇంటలెక్చ్యువల్ ఫోరం రాష్ట్ర కార్యదర్శి ఇయం.స్వామి, అంగన్వాడీ విభాగ జిల్లా కార్యదర్శి హెల్డా ఫ్లోరెన్స్, పట్టణ అధ్యక్షులు షేక్ కరిముల్లా, గిరిజన వెల్ఫేర్ సొసైటీ మాజీ డైరక్టర్ పాలపర్తి వెంకటేశ్వరరావు, పట్టణ కార్యదర్శి కుక్కల పొలయ్య, సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ బూదాల కల్యాణ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆ ముగ్గురి నుంచి నా ఆస్తి కాపాడండి

కలెక్టర్‌కు విన్నవించిన బాధితుడు



కలెక్టర్ కార్యాలయం వద్దకు వచ్చిన పోకూరి సూర్యనారాయణ దంపతులు

నరసరావుపేట: తాను కొనుగోలుచేసి రిజిష్టర్ చేయించుకున్న 50సెంట్ల భూమిని కాజేయాలని చూస్తున్న మాచర్లకు చెందిన నాగూర్‌వలి, కిజర్, సుభానీలపై చర్యలు తీసుకోవాలని బాధితుడు పోకూరి సూర్యనారాయణ కోరారు. ఈ మేరకు సోమవారం పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌ను కలిసి విన్నవించారు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు తాను 1982లో మాచర్ల సిద్దయ్య వద్ద ఒక ఎకరా భూమిని కొనుగోలుచేసి రిజిస్టర్ చేయించుకున్నానని, అందులోని 45సెంట్ల భూమిని వేర్వేరు వ్యక్తులకు విక్రయించానని, తూర్పువైపున ఐదు సెంట్ల భూమిని దారి నిమిత్తం వదిలానని అన్నారు. మాచర్లలో చేతివృత్తి పని చేసుకుంటూ పిల్లల చదువుల నిమిత్తం గుంటూరులో నివాసం ఉంటుండగా, మిగిలిన 45సెంట్ల భూమికి దొంగ అగ్రిమెంట్లు సృష్టించి రెవెన్యూ రికార్డుల్లో వారి పేర్లు నమోదుచేసుకొని పట్టాదారు పాసుపుస్తకాలు కూడా పొందారన్నారు. దీని విషయంపై ఈ ఏడాది ఏప్రిల్‌లో పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చానన్నారు. అయితే రెవెన్యూ అధికారులు తనకు ద్రోహం చేశారన్నారు. తన స్థలం గుండా నేషనల్‌హైవే వెళుతుండగా నష్టపరిహారం కూడా కాజేయాలనే ప్రయత్నం చేశారని, దీనిని తాను రాష్ట్ర హైకోర్టు ఆశ్రయించి నిలుపుదల చేయించానన్నారు.

తన పేరును రెవెన్యూ రికార్డుల్లో నమోదుచేయాలని కోరుతూ మే 30వ తేదీన పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌ను కోరినా ఫలితంలేదని అన్నారు. అప్పటి మాచర్ల తహసీల్దార్ వారితో చేతులు కలిపి తప్పుడు సమాచారం రాష్ట్ర హైకోర్టుకు ఇచ్చారన్నారు. తనకు 84ఏళ్ల వయస్సులో ఉన్నందున తాను తిరగలేకపోతున్నానని, ఇప్పటికే తనను తుదముట్టిస్తామని చేసిన బెదిరింపులపై తాను జిల్లా ఎస్పీకి ఈనెల 15న ఫిర్యాదు చేయటం జరిగిందన్నారు. ఇప్పటికైనా నా రికార్డులను పరిశీలించి భూమిని కొలిపించి హద్దులు నిర్ణయించి, పేరును ఆన్‌లైన్‌లో చేర్చి వారి బెదిరింపుల నుంచి రక్షణ కల్పించాలని సూర్యనారాయణ కోరారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

నూజెండ్ల: వరద నీరు ముంచెత్తి ఇబ్బందుల పడుతున్న కమ్మవారిపాలెం యానాదికాలనీని మండల అధికారులు పరిశీలించారు. ఎంపీడీవో పి. ఉమాదేవి పొక్లయినర్ సాయంతో కాలువ తీయించి వరద నీటిని మళ్లించే ఏర్పాటు చేయించారు. ఆరోగ్యశాఖ వారు అంటువ్యాధులు ప్రబలకుండా మురుగు కాల్వల్లో బ్లీచింగ్ చల్లించి వైద్యశిబిరం ఏర్పాటు చేసి మందులు పంపిణీ చేశారు. కాలనీ వాసులకు తహసీల్దార్ రమేష్‌కుమార్ కాలనీలోని షుమారు 50 కుటుంబాలకు గాను ఒక్కొక్క కుటుంబానికి 5 కేజీల బియ్యం, కందిపప్పు, స్థానిక ఎంఎల్ఏ జి.వి.ఆంజనేయులు అందజేసిన దుప్పట్లు, కూరగాయలు నిత్యావసర సరుకులు అందజేశారు. ప్రభుత్వం తరుపున అన్ని సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని తహసీల్దార్ తెలిపారు. ఆధార్ లేని వారి కోసం ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి ప్రతి ఒక్కరికీ కార్డులు అందజేస్తామన్నారు. గ్రామ నాయకులు గంగినేని బాబు మాట్లాడుతూ స్థానిక ఎంఎల్ఏ సహకారంతో ప్రభుత్వం తరుపున అర్హులైన ప్రతి ఒక్క కుటుంబానికి నివేశన స్థలాలు మంజూరు చేయించటంతో పాటు పక్కా గృహాల నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. ఎంపీడీవో సూచించిన విధంగా కాలనీలోనికి వాగు నీరు రాకుండా త్వరలో కల్వర్టు నిర్మాణం చేపడతామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ సైదా, వీఆర్ఓ నాసర్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

జీఎస్‌టీ సవరణతో పేద, మధ్యతరగతి వర్గాలకు మేలు



ర్యాలీలో పాల్గొన్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

నరసరావుపేట: గూడ్స్ సేల్స్ టాక్స్(జీఎస్‌టీ) సవరణతో దేశవ్యాప్తంగా ఉన్న మధ్యతరగతి , బడుగు బలహీన వర్గాల ప్రజలకు వరమని ఈ నిర్ణయం వారికి ఎంతో లబ్ధిచేకూర్చుతుందని బీజేపీ పల్నాడు జిల్లా అధ్యక్షులు ఏలూరి శశికుమార్ పేర్కొన్నారు. సోమవారం నుంచి కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న జీఎస్‌టీ సవరణలను దేశవ్యాప్తంగా అమలు చేస్తున్న సందర్భంగా జిల్లా అధ్యక్షులు శశికుమార్ నేతృత్వంలో జిల్లా ఇన్‌ఛార్జ్ కొక్కెర శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పరాకుశం శ్రీనివాస్ ముఖ్యఅతిథులుగా పార్టీ శ్రేణులు ప్రకాష్‌నగర్‌లోని పార్టీ జిల్లా కార్యాలయం నుంచి స్టేషన్ రోడ్డు మీదుగా మల్లమ్మ సెంటర్ వరకు పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. జిల్లా అధ్యక్షులు శశికుమార్ మాట్లాడుతూ జీఎస్‌టీ సవరణలో భాగంగా గతంలో ఉన్న నాలుగు స్లాబ్‌లను రెండుగా కుదించి అత్యవసర చికిత్స ఔషధాలు, ఆహార పదార్థాలు తదితర కొన్ని ఉత్పత్తులు జీరో జీఎస్‌టీ, అలాగే అనేక ఉత్పత్తులపై గతం లో 28 శాతంగా ఉన్న పన్నులను 18 శాతంకు, 18 శాతంగా ఉన్న పన్నులను ఐదుశాతంకు తగ్గించడం ప్రతిష్టాత్మక నిర్ణయమని అన్నారు. అదేవిధంగా ప్రజలందరూ ప్రతి ఇంటా స్వదేశీ – ఇంటింటా స్వదేశీ నినాదాన్ని తీసుకొని స్వదేశీ వస్తు ఉత్పత్తులనే వాడటం ద్వారా స్వదేశీ పరిశ్రమలను ప్రోత్సహించి దేశ ఆర్థిక స్వావలంబనలో భాగస్వాములవ్వాలని కోరారు. రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేశారు.

ఎన్ఈసీకి విజినరీ లీడర్ అవార్డు



నరసరావుపేట రూరల్: నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాలకు టైమ్స్ గ్రూప్ ప్రతిష్టాత్మకమైన విజినరీ లీడర్ ఇన్ హైయర్ ఎడ్యుకేషన్ అవార్డును ప్రకటించింది. విజయవాడ ఏ ప్లస్ కన్వెన్షన్ సెంటర్‌లో ఆదివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో అవార్డును కళాశాల వైస్ చైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి, డైరక్టర్ మిట్టపల్లి సుహాసినిలు సినీ నటి రాశీఖన్నా చేతుల మీదగా అందుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చక్రవర్తి మాట్లాడుతూ ఉన్నత విద్యలో మార్పులు తీసుకువస్తూ కొత్త తరం నాయకులను తయారు చేయడం మా లక్ష్యం అన్నారు. అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థుల సమిష్టి కృషికి లభించిన గుర్తింపు ఈ అవార్డు అన్నారు.

ఆటో డ్రైవర్ ఆత్మహత్య



చిలకలూరిపేటటౌన్: అనుమానస్ప స్థితిలో ఆటో డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన చినపసుమర్రు గ్రామ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని భావన ఋషినగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ వింజమూరి ఆదినారాయణ సోమవారం సాయంత్రం జాతీయ రహదారి గొర్రెలమండి సమీపంలోని పొలాల్లో ఓ వేపచెట్టుకు ఉరి వేసుకున్నాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలను సేకరించారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిలకలూరిపేట రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే ఆర్థిక ఇబ్బందుల కారణంగానే ఆత్మహత్యకు ఆదినారాయణ బలవన్మరణం చేసుకున్నట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. మృతునికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతదేహాన్ని ఇంటికి తీసుకురావడంతో భావన ఋషినగర్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

వివరాలు చెప్పమంటే స్పందించడం లేదు!



ఫిర్యాదు చేసేందుకు వచ్చిన ప్రజాసంఘాల నాయకులు

నరసరావుపేట రూరల్: సమాచార హక్కు చట్టం ద్వారా జొన్నలగడ్డ పంచాయతీ పన్నుల వివరాలు తెలపాలని దరఖాస్తు చేసినా స్పందించకపోవడంపై ప్రజా సంఘాల నాయకులు ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఫిర్యాదు చేశారు. మండలంలోని జొన్నలగడ్డ పంచాయతీ పరిధిలో విద్యాసంస్థలు, వ్యాపార సంస్థలతో పాటు ఇంటి పన్నుల వివరాలు తెలిపాలని 40 రోజుల క్రితం పంచాయతీ కార్యదర్శికి దరఖాస్తు చేసినట్టు ఫిర్యాదు లో తెలిపారు. తాము చేసిన దరఖాస్తుకు ఇప్పటి వరకు పంచాయతీ కార్యదర్శి నుంచి ఎటువంటి సమాచారం అందలేదన్నారు. పంచాయతీకి ఆదాయం ఉన్నా గ్రామంలో కనీసం వీధి దీపాలు కూడా డబ్బులు లేవని పంచాయతీ కార్యదర్శి చెప్పడం హస్యాస్పదంగా ఉందని తెలిపారు. పంచాయతీ పరిధిలో పన్నులు, అభివృద్ధి వివరాలు చెప్పకుండా సమాచార హక్కు చట్టాన్నినీరుగార్చేందుకు ప్రయత్నిస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎం నాయకులు నల్లపాటి రామారావు, వై.వెంకటేశ్వరరావు, బీసీ నాయకులు బాదుగున్నల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను పునరుద్ధరించాలి



మార్కెట్ యార్డ్ ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న నాయకులు

నరసరావుపేట ఈస్ట్: కార్మిక లోకానికి తీవ్ర నష్టాన్ని కలిగించే లేబర్‌కోడ్‌లను వెంటనే ఉపసంహరించుకోవాలని వామపక్ష కార్మిక సంఘాలు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. పార్లమెంట్‌లో 2020 సెప్టెంబర్ 22వ తేదీన లేబర్‌కోడ్‌లను ఆమోదించిన రోజును పురస్కరించుకుని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం వ్యవసాయ మార్కెట్ యార్డు ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు కార్మిక నాయకులు మాట్లాడుతూ, పార్లమెంట్‌లో ప్రతిపక్ష పార్టీల సభ్యులు వాకౌట్‌లో ఉండగా, కేంద్ర బీజేపీ ప్రభుత్వం హడావుడిగా లేబర్ కోడ్‌లను ఆమోదించటం అప్రజాస్వామికమని ఆందోళన వ్యక్తం చేశారు. ఎందరో కార్మికుల ప్రాణాలను త్యాగం చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి లేబర్ కోడ్‌లను ప్రవేశపెట్టడం దారుణమన్నారు. కేంద్రంలో కూటమి ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు దేశ సంపదను దోచిపెడుతూ, పేద మధ్యతరగతి ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం బుద్ధి తెచ్చుకొని కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని హితవు పలికారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు ఉప్పలపాటి రంగయ్య, షేక్.జాన్‌చిన సైదా, నాగేశ్వరరావు, సీఐటీయూ నాయకులు ఆంజనేయ నాయక్, పీడీఎం నాయకులు నల్లపాటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కూటమి పాలనపై విసుగెత్తిన ప్రజలు



సంకురాత్రిపాడులో క్యూఆర్ కోడ్ చూపుతున్న పార్టీ నాయకులు

నాదెండ్ల: ప్రతి ఎన్నికల్లో అలవికాని హామీలిచ్చి ప్రజల్ని వంచించి గద్దెనెక్కే చంద్రబాబునాయుడు, ఇచ్చిన హామీలను గాలికొదిలేయటం ఆయన నైజమని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మద్దూరి కోటిరెడ్డి, ప్రధాన కార్యదర్శి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు చెప్పారు. నాదెండ్ల, చిరుమామిళ్ళ, జంగాలపల్లె గ్రామాల్లో శనివారం బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ గ్రామాల్లోని ప్రధాన వీధుల్లో కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల్లో ఇచ్చిన కరపత్రాన్ని చూపుతూ క్యూఆర్ కోడ్ ద్వారా హామీలను చూపే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి పథకంలో కోతలు విధిస్తూ అన్ని వర్గాల ప్రజలను వంచించిందన్నారు. గత ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలతో పాటూ రైతు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి రైతులకు అండగా నిలిచామన్నారు. కూటమి ప్రభుత్వంలో ఏడాది గడిచినా రైతులను నట్టేట ముంచారన్నారు. ఏ పంటకూ గిట్టుబాటు ధరలేక రైతులు ఆత్మహత్యలు చేసుకోవటం వంటి దుర్ఘటనలు చోటు చేసుకున్నాయన్నారు. పొగాకు, మిర్చి, అపరాల ధరలు పూర్తిగా పడిపోయాయన్నారు. తల్లికి వందనం పథకం అర్హులందరికీ అమలు కాలేదన్నారు. జగనంటే నమ్మకం, బాబంటే మోసం అని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షుడు మంగు ఏడుకొండలు, జిల్లా అధికార ప్రతినిధి ఉడతా వెంకటేశ్వరరావు, యువజన విభాగం అధ్యక్షుడు కందుల శ్రీకాంత్, నియోజకవర్గ అధ్యక్షుడు ప్రభుదాస్‌నాయుడు, యూత్ అధ్యక్షుడు చందు, మాజీ ఎంపీపీ కంజుల వీరారెడ్డి, మాజీ యార్డు ఛైర్మన్ సింగారెడ్డి కోటిరెడ్డి. మండల ఉపాధ్యక్షుడు అల్లడి రవికుమార్, బత్తుల సీతారామిరెడ్డి, జోజిబాబు, రామకష్ణ, పలు విభాగాల నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ బృందం భేటీ

బొల్లాపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీ బృందం సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఆర్‌పి, బి.ఆవులయ్య మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం , పంచాయతీరాజ్, సామాజిక భద్రత పింఛన్లు పై సోషల్ ఆడిట్ ఉంటుందని,17 వ విడత సామాజిక తనిఖీ బృందాలు నేటి నుంచి గ్రామాల్లో జరిగిన పనులను తనిఖీలు చేపడతామని తెలిపారు. వీటితోపాటు సామాజిక భద్రత పింఛన్లు తనిఖీ ఉంటుందని ఎస్ ఆర్ పి చెప్పారు.

కార్మిక వ్యతిరేక జీఓలను వెనక్కు తీసుకోండి

నరసరావుపేట: కూటమి ప్రభుత్వ ఎనిమిది గంటలు పని విధానాన్ని పది గంటలకు మార్చటం, రాత్రి వేళల్లో మహిళల చేత పనిచేయించాలనే జీవోలను రద్దు చేయాలని పలు కార్మిక సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పల్నాడు జిల్లా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ఆర్టీసీ బస్టాండ్ వద్దనున్న మార్కెట్‌యార్డు ఎదుట సీఐటీయూ నరసరావుపేట మండల కార్యదర్శి సిలార్ మసూద్ అధ్యక్షతన నిరసన కార్యక్రమం చేపట్టారు.

సాగర్‌బాబు సమస్యను పట్టించుకోండి

నరసరావుపేట: సాగర్‌బాబుని వికలాంగుడిగా మారటానికి కారణమైన కారంపూడి మండలం పెద కోదమగుండ్ల విద్యుత్ లైనెమెన్, అసిస్టెంట్ లెన్‌మెన్‌లపై చర్యలు తీసుకోవాలని 10 రోజుల నుంచి దీక్షలు కొనసాగిస్తున్నా, మూడుసార్లు గ్రీవెన్‌సెల్‌లో కలెక్టర్‌కు, రెండుసార్లు జిల్లా ఎస్పీకి అర్జీలు ఇచ్చినా నేటికి ఎలాంటి చర్యలు లేకపోవటంపై ప్రజాసంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి మరోసారి కలెక్టర్, ఎస్పీలకు అర్జీలు అందజేశారు.

క్లాప్ మిత్రలకు వేతనాలు ఇవ్వాలంటూ ధర్నా

ఈపూరు(శావల్యాపురం): ఈపూరు గ్రామ పంచాయతీలో స్వచ్ఛ భారత్‌లో క్లాప్ మిత్రలు 15 మంది విధులు నిర్వహించుతున్నారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆర్భాటంగా క్లాప్‌మిత్రలపై సవితి తల్లి ప్రేమ చూపించటం వైద్య పరీక్షలు ఆర్భాటపు ప్రచారాలు మినహా వారి కుటుంబ పోషణపై శ్రద్ధ చూపటంలో విఫలమైందన్నారు.

సైన్స్‌లో చార్లెస్ పాఠశాల విద్యార్థుల సృజనాత్మకత



సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శనను తిలకిస్తున్న ఫాదర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు

చిలకలూరిపేటటౌన్: పట్టణంలోని పెదనందిపాడు మార్గంలో ఉన్న సెయింట్ చార్లెస్ ఐసీఎస్ఈ పాఠశాలలో సోమవారం సైన్స్ ఎక్స్‌పో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తమ సృజనాత్మకతతో రూపొందించిన పలురకాల సైన్స్ ప్రయోగాలను ప్రదర్శించారు. చిన్నారులు రూపొందించిన ప్రయోగాలను, అతిథులకు, విద్యార్థులకు వివరించారు. విద్యార్థుల ప్రతిభను, ప్రయోగాలను చూసి వారంతా అభినందించారు. ఈ కార్యక్రమాన్ని ఆర్సీఎంచర్చి ఫాదర్ పూదోట థామస్ స్టాటన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ ఎస్ బాలసౌరి, మదర్ సుపీరియర్ శాంత, పాఠశాల ప్రిన్సిపాల్ సుప్రియ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.